
సాక్షి ఒడిశా

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,92,253

- భువనేశ్వర్/పూరీ



బీజేడీ మహిళా మోర్చా ఆందోళన

భరత్‌పూర్ ఠాణాలో మేజరు, అతని స్నేహితురాలిపై పోలీసు అధికారి, సిబ్బంది అమానుష చర్యపై బిజూ జనతా దళ్ మహిళా వర్గం ఆందోళనకు దిగింది.

- 8లో



పౌష్టికాహారంతో చిన్నారులకు ఆరోగ్యం

పౌష్టికాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జయపురం: స్థానిక అప్పర్ కొలాబ్ సాగునీటి కెనాల్ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పట్టణ పోలీసులకు అందిన సమాచారంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడిని పరీక్షించిన డాక్టర్లు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆ మార్గంలో భారీ వాహనాలు వెళ్లకుండా కాంక్రీట్ వాల్‌ను ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే కెనాల్ మార్గంలో మృతుడు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగి ఉంటుందని పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి అభిప్రాయపడ్డారు. మృతుడి వివరాలు ఇంతవరకు తెలియలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలకు హెచ్‌ఐవీ పరీక్షలు



ఖైదీలకు రక్త పరీక్షలు జరుపుతున్న డాక్టర్లు

జయపురం: స్థానిక సబ్ జైలులో జయపురం జిల్లా ప్రధాన ఆస్పత్రి, ఒడిశా ఎయిడ్స్ నియంత్రణ సమితి, పిరమిల్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా హెచ్‌ఐవీ పరీక్షల శిబిరాన్ని శనివారం నిర్వహించాయి. దీనిలో భాగంగా 100 మందికి పైగా ఖైదీలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఎయిడ్స్ వంటి వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే క్షయ, హెపటైటిస్ బీ, సీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఉమాకాంత మఝి, పరీక్ష కేంద్ర అధికారి మనోజ్ కుమార్ పండ, పిరమిల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ లక్ష్మీప్రియ సాహు, సుధీర్ కుమార్ పండ, రామకృష్ణ సాహు, ల్యాబ్ టెక్నీషియన్ ధీరజ్ కుమార్ భాగ్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



పట్టుబడిన కొండచిలువ

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఇండియన్ గ్యాస్ గోదాం వద్ద 9 అడుగుల కొండ చిలువ కలకలం సృష్టించింది. గ్యాస్ సిలిండర్లతో వచ్చిన ట్రక్ కింద శనివారం ఉదయం కొండ చిలువ కనిపించడంతో అక్కడ ఉన్నవారు గమనించి స్నేక్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దానిని జిల్లా అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఎంవీ 11 గ్రామం వద్ద అడవిలో వదిలేశారు.

గంజాయితో ఇద్దరు మహిళలు అరెస్టు



గంజాయితో పట్టుబడిన మహిళలు

జయపురం: ఒక ఆటోలో గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరు మహిళలను బొయిపరిగుడ ఎక్సైజ్ సిబ్బంది అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సావిత్రి బాలాజీ, సంధ్యా హరిజన్‌లు ఉన్నట్లు తెలియజేశారు. బొయిపరిగుడ బీరకంభ మందిర మార్గంలో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఆ మార్గంలో ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో బీరకంభ వీధి అంగన్‌వాడీ కేంద్ర వద్ద ఉన్న ఆటో వద్దకు వెళ్లి తనిఖీ చేయగా ఇద్దరు మహిళలు గంజాయితో పట్టుబడ్డారు. గంజాయి తూకం వేయగా 25 కేజీల 500 గ్రాములు ఉన్నట్లు ఎక్సైజ్ అధికారి భగవాన్ మహానందియ వెల్లడించారు. గంజాయిని జయపురం తీసుకెళ్తున్నట్లు నిందితులు వెల్లడించారని పేర్కొన్నారు.

నిన్నటి తరం వరకు ఉబ్బెత్తుగా కనిపించిన చొక్కా జేబు ఇప్పుడు ఉనికి కోల్పోయింది. సర్వకాల సర్వావస్థల్లోనూ తోడుగా ఉన్న వెనుక జేబు పర్సు చిన్నబుచ్చుకుంటోంది. జనం మారిపోయారు. మాటిమాటికీ డబ్బులు తీసి ఇచ్చే పాత అలవాటును మర్చిపోయి సెల్‌ఫోన్‌తో చెల్లింపులు చేయడం నేర్చేసుకున్నారు. ఈ సులభ అలవాటు సుఖంతో పాటు ప్రమాదాలనూ తెచ్చి పెట్టింది. ఈ సాంకేతిక సాయంతో సైబర్ నేరగాళ్లు కూడా రెచ్చిపోతున్నారు. ఏ కష్టం లేకుండా రెండు మాయ మాటలు చెప్పి ఖాతాలు ఖాళీ చేసేస్తున్నారు.



క్లిక్.. స్కాన్.. స్కామ్



హుండీ చెల్లింపులో డిజిటల్ వ్యవస్థ

ఇస్మార్ట్ పే..!

భువనేశ్వర్: ప్రస్తుత దైనందిన జీవితంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అనుక్షణం కొత్త పుంతలు తొక్కుతోంది. జేబులో చిల్లిగవ్వ లేకున్నా సెల్‌ఫోన్ ఉంటే ఎంతైనా ఖర్చు పెట్టేందుకు అదృశ్య లక్ష్మి అరచేతిలో ప్రత్యక్షమవుతోంది. దూర ప్రాంతాల్లో బంధుమిత్రుల కార్యకలాపాలకు ప్రత్యక్షంగా హాజరు కాలేకున్నా, కానుకలను ఉన్నచోటు నుంచే చిటికెలో అందజేసే సౌలభ్యం లభిస్తోంది. ఇప్పుడు ప్రతీ ఒక్కరి జీవితాల్లో గూగుల్ పే, ఫోన్ పే చెల్లింపులు సాధారణమైపోయాయి. కొన్ని ఆలయాలు, ఆటోలు, వ్యాపార స్థలాల్లో వారి ఖాతాలు వెళ్లేలా క్యూ ఆర్ కోడ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే డిజిటల్ చెల్లింపులనే ఆసరాగా తీసుకుంటున్న సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. అమాయకులను బురిడీ కొట్టించి ఖాతాల్లో డబ్బులను కొల్లగొడుతున్నారు. క్యూఆర్ కోడ్ చెల్లించేందుకు మాత్రమే వర్తిస్తుంది. నగదు పొందేందుకు క్యూ ఆర్ సదుపాయం లేదు. ఈ విషయాన్ని తెలుసుకొని బూటకపు ఎస్‌ఎంఎస్‌ల బారిన పడకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.



డిజిటల్ ఆటోవాలా

నెట్ లేకుంటే ఇక్కట్లు

డిజిటల్ చెల్లింపుల్లో ఇంటర్నెట్ అనేది అత్యంత ముఖ్యమైన అంశం. నెట్‌వర్క్ సౌకర్యం లేకుంటే లావాదేవీలు అర్ధాంతరంగా నిలిచిపోయి దూర ప్రాంతాల్లో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అందువలన చెల్లింపులు చేసేటప్పుడు నెట్‌వర్క్‌ను ఒకసారి సరి చూసుకోవాల్సి అవసరం ఉంది.







కాయగూరలు అమ్ముతున్న మహిళలు క్యూ ఆర్ కోడ్ ఉపయోగిస్తున్న దృశ్యం

సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం

రాయగడ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ అవినాష్ రెడ్డి సూచించారు. రోజుకో పద్ధతిలో మోసగాళ్లు అమాయకులైన ప్రజల అకౌంట్లు ఖాళీ చేస్తున్నారని హెచ్చరించారు. ఈ నేరాలను అదుపులోకి తీసుకొచ్చేందుకు క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య వేదికలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎక్కువగా సీనియర్ సిటిజన్లు వీరి ఉచ్చులో కూరుకుపోతున్న ఘటనలు తమ దృష్టికి ఎక్కువగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వెంటనే స్పందించాలి

ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారినపడి తమ అకౌంట్‌లో డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే స్పందించి 1930కు సమాచారం అందిస్తే కొంతవరకు సైబర్ నేరగాళ్ల బారి నుండి కాపాడుకునే అవకాశం ఉందని రెడ్డి వివరించారు. అయితే ఇటువంటి కేసులు తక్కువగా తమ దృష్టికి వస్తున్నాయని, బాధితులు తమకు సమాచారం అందించేలోపే మోసగాళ్లు వారి ఖాతాలను ఖాళీ చేస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సైబర్ (పోలీస్) విభాగం ముందస్తు చర్యలను చేపడుతోందన్నారు.

విద్యార్థుల్లో చైతన్యం

సైబర్ నేరాల బారి నుంచి కాపాడుకునే విషయంలో విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఇలాంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఎవరైనా తెలియని వ్యక్తి నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ వచ్చినా స్పందించకూడదని సూచించారు. ముఖ్యంగా అటువంటి కాల్స్‌ని రిసీవ్ చేయకపోవడమే ఉత్తమమని సూచించారు. సైబర్ నేరగాళ్ల బారి నుంచి ప్రజలు మోసపోకుండా పోలీస్ విభాగం చేపడుతున్న విస్తృత ప్రచారాలు, చైతన్య కార్యక్రమాల వల్ల గత కొద్ది నెలలుగా కేసులు తగ్గుముఖం పడుతున్నాయని వెల్లడించారు.



అవినాష్ రెడ్డి (ఫైల్)



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ అవినాష్ రెడ్డి



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

నిన్న రమ్మన్నారు.. నేడు వద్దన్నారు



ఎంపీ సప్తగిరిని ప్రశ్నిస్తున్న పాత్రికేయులు

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో దిశా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి పాత్రికేయులను ఆహ్వానించకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. దిశా కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక పాత్రికేయులను అనుమతించకపోవడంతో ఆయనను నిలదీశారు. ఇటీవల ఇదే సమావేశ మందిరంలో జిల్లా యంత్రాంగం జిల్లా పరిషత్ సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కలెక్టర్ ఫరూల్ పట్వారి పాత్రికేయులను అనుమతించకపోవడంతో నిలదీసిన ఎంపీ సప్తగిరి, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కడ్రకలు ఈ సమావేశంలో మాట మార్చేశారు. దీంతో నిన్న రమ్మని చెప్పినవారే.. నేడు వద్దని అన్నారని అందరూ గుసగుసలాడారు. అనంతరం ఈ సమావేశాన్ని పాత్రికేయులు బహిష్కరించారు.

ఆవాస్ గృహాలు మంజూరు చేయండి



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన మహిళలు

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి సెరిగుమ్మ గ్రామానికి చెందిన మహిళలు తమకు ఆవాస్ గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఫరూల్ పట్వారీని శనివారం కలిసి సమస్యలు తెలియజేశారు. గ్రామంలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నా ఇంతవరకు ఎవరికీ ఆవాస్ పథకం కింద ఇళ్లు మంజూరవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు సంబంధిత శాఖ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. తాము నివసిస్తున్న ఇళ్లముందు నిల్చున్న ఫొటోలతో వారంతా డీఆర్‌డీఏ సమావేశ మందిరానికి చేరుకున్నారు. అదే సమయంలో దిశ సమీక్షా సమావేశానికి హాజరవుతున్న కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికకను కలిసి ఈ సమస్యను వివరించేందుకు వెళ్లిన వారికి చివరకు నిరాశే మిగిలింది. ఎంతో దూరం నుంచి వచ్చిన తమను కలిసేందుకు కనీసం సమయం కేటాయించని ప్రజాప్రతినిధులపై మహిళలు రుసరుసలాడారు. ఎన్నికల ముందు తమ చుట్టూ తిరిగిన నాయకులు, ఎన్నికల అనంతరం ఇలా మొఖం చాటువేయడంపై మండిపడ్డారు.

వికసిత్ ఒడిశా మా లక్ష్యం

- త్వరలో టీచర్ పోస్టులు భర్తీ
- మంత్రి బిభూతి జెన్నా



సుభద్ర పథకం చెక్కులు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: వికసిత్ ఒడిశానే తమ లక్ష్యమని రాష్ట్ర రవాణా, ఖనిజ శాఖల మంత్రి బిభూతి జెన్నా అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో రాష్ట్రం ప్రభుత్వ 100 రోజుల పాలన పురస్కరించుకొని వికాస్ మేళాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత పూరీలోని శ్రీజగన్నాథుని మందిరం నాలుగు ద్వారాలు తెరవగలిగామని, రైతులకు ధాన్యం మద్దతు ధర రూ.3 వేలుకు పెంచామని తెలిపారు. సుభద్ర పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఏడాదికి రూ.10 వేలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న రోజుల్లో 60 వేల టీచర్ల పోస్టులు భర్తీ చేయనున్నామని ప్రకటించారు. వాణిజ్య, రవాణా విభాగంలో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం

రాష్ట్రంలో గోపబంధు ఆరోగ్య జన యోజన పథకం కింద పేదలకు 9వేల ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించనున్నామని మంత్రి బిభూతి జెన్నా వెల్లడించారు. మూడు నెలల్లో పేదలకు లక్ష ఇళ్లు పీఎం యోజన ద్వారా మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒడిశాకు ప్రధాని నరేంద్ర మోదీ 8 వందే భారత్ రైళ్లు ఆమోదించారని పేర్కొన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులు, దివ్యాంగులు, సుభద్ర లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

ఐదేళ్లలో దంబాపూర్ ప్రాజెక్టు పూర్తి

అనంతరం పర్లాకిమిడి మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మాట్లాడుతూ గజపతి జిల్లాలో అపరిష్కృతంగా మిగిలిపోయిన దంబాపూర్ ప్రాజెక్టును ఈ ఐదేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే కృష్ణచంద్ర గజపతి కళాశాలకు విశ్వవిద్యాలయంగా గుర్తింపు, కాశీనగర్‌లో మెగా లిఫ్టు ఎత్తిపోతల పథకం సరిదిద్దుతామని, గుణుపురం నుంచి హైదరాబాద్‌కు ట్రైన్ లైను వేయనున్నట్లు పేర్కొన్నారు. తెరువల్లి నుంచి మునిగుడకు రైల్వేలైను వస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కలెక్టర్ బిజయకుమార్ దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, నువాగడ సమితి చైర్మన్ మాలతీ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బిభూతి భూషణ్ జెన్నా



సమావేశానికి హాజరైన మహిళలు

క్లుప్తంగా

సాగునీరు అందించాలని ధర్నా



ధర్నా చేస్తున్న కౌలు రైతులు

జి.సిగడాం: తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తామని చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కౌలు రైతు సంఘం నాయకుడు వెలమల రమణ కోరారు. ఈ మేరకు శనివారం కౌలు రైతులతో కలిసి బాతువ గ్రామ సమీపంలో తోటపల్లి కాలువ వద్ద ధర్నా నిర్వహించారు. బోరప తివాని చెరువు వద్ద షట్టర్లు ఏర్పాట చేయాలని, మొక్క జొన్నరైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సింహాచలం, లక్ష్మణరావు, అసిరినాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఔదార్యం



బైక్ డ్రైవ్ చేస్తూ ఫాగింగ్ చేయిస్తున్న సర్పంచ్ సింహాచలం

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధిలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా స్థానిక సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత గణప సింహాచలం ఫాగింగ్ చేయిస్తున్నారు. ద్విచక్ర వాహనాన్ని స్వయంగా నడుపుతూ ఓ మనిషి సాయంతో ఫాగింగ్ యంత్రం ద్వారా అన్ని గ్రామాల్లో దోమల నివారణ మందు స్ప్రే చేయించారు. సర్పంచ్ తనే స్వయంగా వాహనం నడుపుతూ వ్యాధులు నివారణకు ఇలా ప్రజాసేవ చేయడంపై స్థానికులు అభినందిస్తున్నారు.

విద్యార్థుల్లో సేవాభావం పెరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూనియర్ /యూత్ రెడ్‌క్రాస్‌ల ద్వారా యువతలో సేవాభావం పెంచాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూనియర్ /యూత్ రెడ్‌క్రాస్ సమీక్ష నిర్వహించారు. వివిధ సేవా కార్యక్రమాలను సెక్రటరీ బి.మల్లేశ్వరరావు వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవాభావం పెరిగేలా పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు

వజ్రపుకొత్తూరు : సరస్వతీ పూజ సందర్భంగా ఉద్దానం రామకృష్ణాపురంలో అక్టోబర్ 7 నుంచి 9 వరకు జిల్లా స్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీలకు ప్రవేశ రుసుం ఉచితమని, అల్పాహారం, భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.30వేలు, ద్వితీయ రూ.25వేలు, తృతీయ రూ.20 వేలు, 4వ బహుమతి రూ.15వేలుతో పాటు షీల్డులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 7382095831, 9704695435 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రతికూల ఆలోచనలు అనర్థం



మాట్లాడుతున్న సైకాలజీ కౌన్సెలర్ ఎం.వి.ఆర్.రాజు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండాలని విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రముఖ సైకాలజీ కౌన్సెలర్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో శనివారం సెంటర్ ఫర్ సైకలాజికల్ అసెస్మెంట్ అండ్ కౌన్సెలింగ్ సంస్థ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆత్మ హత్యల నివారణ దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎప్పుడు నిరాశ, నిస్పృహ, కోపం, ఒత్తిడికి గురికాకూడదన్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రశాంత జీవనశైలికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ కె.ఆర్.రజిని, రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్లు ఎం.అనురాధ, ఎస్.ఉదయ్‌భాస్కర్, సి.హెచ్.రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

నిండినది



హీరాకుడ్ జలాశయం నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ఈ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 630 అడుగులు కాగా, శనివారం ఉదయం 9 గంటలు సరికి 629.54 అడుగులకు తాకింది. జలాశయంలోనికి ప్రతీ సెకనుకు 65 వేల 865 క్యూసెక్ల నీరు ప్రవేశిస్తుండగా, 40 వేల 456 క్యూసెక్ల నీరు లోతట్టు ప్రాంతాలకు ప్రవహిస్తోంది.

– భువనేశ్వర్

బీఎస్‌ఎఫ్ జవాన్ల స్వచ్ఛ భారత్



మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని మల్లికేశ్వర్ కొండపై ఉన్న శివాలయం ప్రాంగణంలో మల్కన్‌గిరి ఎంఈ 3 గ్రామం వద్దనున్న బీఎస్‌ఎఫ్ 2వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు శనివారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కొండపై భక్తులు పడేసిన వాటర్ బాటిల్స్, పాలిథిన్ కవర్లు శుభ్రపరిచారు. కార్యక్రమంలో 2వ బెటాలియన్ బీఎస్‌ఎఫ్ కామాండర్ రాజేష్ కుమార్, డిప్యూటీ కమాండార్ జేశ్మంధర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

– మల్కన్‌గిరి







కారులో చెలరేగిన మంటలు



బాలాసోర్ జిల్లా జలేశ్వర్ నుంచి బొస్తా ఆస్పత్రి మార్గంలో పరుగులు తీస్తున్న కారులో అకస్మాతుగా మంటలు చెలరేగాయి. సమయస్ఫూర్తితో డ్రైవర్ బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకోగలిగాడు. అగ్నిమాపక దళం ఘటనా స్థలం చేరుకుని మంటలు నివారించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

– భువనేశ్వర్

నవరంగ్‌పూర్‌కు 6 స్వర్ణ పతకాలు



సత్తాచాటిన నవరంగ్‌పూర్ క్రీడాకారులు

జయపురం: భువనేశ్వర్‌లో ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్‌లో పోటీల్లో నవరంగపూర్ ఆటగాళ్లు 6 స్వర్ణ పతకాలతో పాటు, 16 పతకాలు సాధించారు. వాటిలో రజిత పతకాలు 3 కాగా, 7 కాంస్య పతకాలులు దక్కాయి. దీంతో వీరిని స్థానికులు అభినందిస్తున్నారు.

పౌష్టికాహారంతో చిన్నారులకు ఆరోగ్యం



అవగాహన శిబిరం నిర్వహిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: పౌష్టికాహారంతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో అన్నారు. మోహనాలో జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా మోహనా సమితి కార్యాలయం నుంచి కల్యాణ మండపం వరకు పాదయాత్ర జరిపారు. ఈ పాదయాత్ర బరంపురానికి చెందిన పీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరగగా.. జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, బీడీవో రాజీవ్ దాస్, ఏబీడీవో రమాకాంత్ చౌదరి, సీడీపీవో సబితా పట్నాయిక్, మోహనా బ్లాక్ ఉపాధ్యక్షురాలు బల మీనా అధికారి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి అప్పగించాలి

జయపురం: సమితి పరిధిలోని జయంతిగిరి వారపు సంతను రెగ్యులేటింగ్ మార్కెట్ కమిటీ(ఆర్‌ఎంసీ) ఆధీనం నుంచి పంచాయతీకి అప్పగించాలని జయంతగిరి ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం సర్పంచ్ భద్ర పూజారి నేతృత్వంలో గ్రామ ప్రజలు సబ్ కలెక్టర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. జయంతిగిరి సంత 1983లో ఆనాటి సర్పంచ్ భద్ర పూజారి సంత ప్రారంభించారు. తర్వాత సంత బాధ్యతను ఆర్‌ఎంసీ చేపట్టి ఏడాది రూ.50 వేలు పంచాయతీకి ఇచ్చేదని వారు సబ్ కలెక్టర్‌కు వివరించారు. అయితే కొన్నేళ్లుగా ఆర్‌ఎంసీ డబ్బు చెల్లించడం లేదని ఆరోపించారు. అందువలన సంతను జయంతగిరి పంచాయతీకి అప్పజెప్పాలని విజ్ఞప్తి చేశారు.

చీఫ్ ఇంజినీర్ అరెస్టు



ఎస్.వి.హరిహరరావు

భువనేశ్వర్: బాలాసోర్ గ్రామీణ నిర్మాణ శాఖ చీఫ్ నిర్మాణ ఇంజినీర్ ఎస్.వి. హరిహరరావుని విజిలెన్స్ వర్గాలు అరెస్టు చేశారు. భువనేశ్వర్, బరంపురం తదితర ప్రాంతాల్లో భవనాలు, ఫ్లాట్లు, ఇండ్ల స్థలాలు, భారీ మొత్తంలో నగదు, బంగారం వంటి ఆస్తుల్ని విజిలెన్సు వర్గాలు గుర్తించాయి. లెక్కాజమ లేని ఆస్తులుగా ఖరారు కావడంతో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

7 మంది రోమియోలు అరెస్టు

భువనేశ్వర్: ఆర్మీ మేజర్, అతని స్నేహితురాలిపై నడిరోడ్డు మీద రాత్రిపూట దాడికి పాల్పడి వేధించిన సంఘటనలో నిందితులను చందకా ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో 7 మంది రోడ్డు రోమియోలను అరెస్టు చేసినట్లు శనివారం ప్రకటించారు. వీరి దగ్గర నుంచి 11 సెల్‌ఫోన్లు, ఒక వాహనం స్వాధీనపరచుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ప్రశ్నించిన మేరకు అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు అదనపు డీసీపీ కృష్ణ ప్రసాద్ దాస్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

నరసన్నపేట: కొల్లవానిపేట సమీపంలో రన్నింగ్ ట్రెన్ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపారు. శనివారం ఉదయం ఈ ఘటన జరిగిందని, మృతుడు ఒడిశా వాసిగా గుర్తించామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతుడి బంధువులు ఆదివారం చేరుకుంటారని, వారు వస్తే పూర్తి సమాచారం తెలుస్తుందని వివరించారు. విశాఖ నుంచి పలాస డౌన్ లైన్‌లో వెళ్తున్న ఈస్ట్‌కోస్ట్ రైలులో ఈయన ప్రయాణిస్తున్నట్లు తెలిసిందన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన రావివలస మల్లేశ్వరరావు(36) కొద్ది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. శనివారం సాయంత్రం మద్యం తాగి టెక్కలి పాతజాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా నవీన్‌నగర్ వద్ద లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంబేరిలో పారిశుద్ధ్య పనులు



లంబేరి గ్రామాన్ని శుభ్రపరుస్తున్న కార్యకర్తలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి లంబేరి గ్రామంలో గత కొద్ది రోజులుగా వ్యాపించిన డయేరియా కారణంగా ఐదుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. గ్రామంలో పరిశుభ్రత లోపించడంతో పాటు కలుషిత తాగు నీరు తాగడమే ఈ వ్యాధికి కారణమని ప్రాథమికంగా అంచనా వేశారు. దీంతో ఆ గ్రామంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శుభ్రత పాటిస్తే ఎటువంటి రోగాలు దరిచేరవని వివరించారు.

బీజేడీ మహిళా మోర్చా ఆందోళన



రాజ్ భవన్ ఎదురుగా ఆందోళన చేస్తునన బీజేడీ మహిళా విభాగం

భువనేశ్వర్: భరత్‌పూర్ ఠాణాలో మేజరు, అతని స్నేహితురాలిపై పోలీసు అధికారి, సిబ్బంది అమానుష చర్యపై బిజూ జనతా దళ్ మహిళా వర్గం ఆందోళనకు దిగింది. రాష్ట్రంలో శాంతి భద్రతల వ్యవస్థ పూర్తిగా దిగజారింది, నిందితుల వ్యతిరేకంగా చర్యలు శూన్యం కావడంతో దుండగుల ఆగడాలకు అదుపులేకుండా పోయిందని ఆరోపించారు. పూరీ శ్రీజగన్నాథ రథయాత్ర సమయంలో గవర్నర్ కుమారుడు రాష్ట్ర ప్రభుత్వ అధికారిపై ప్రాణాంతక దాడికి పాల్పడినా ఇంతవరకు చర్యలు శూన్యంగా పరిణమించాయి. దీంతో తాజాగా మేజరుపై దాడికి పాల్పడిన చర్యలు కానరావడం లేదని బీజేడీ మహిళ వర్గం నాయకురాలు లేఖశ్రీ సామంత సింగార్ ఆరోపించారు. శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన బీజేపీ పాలన వ్యతిరేకంగా పల్లె నుంచి శాసన సభ వరకు ఆందోళన ఉధృతం చేసేందుకు తమ వర్గం వెనుకాడదని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం భారత రాష్ట్రపతిని ఉద్దేశించిన స్మారక పత్రం రాష్ట్ర గవర్నర్‌కు అందజేశారు.


కంట్రోల్ రూమ్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్ ప్రారంభిస్తున్న డీఐజీ చరణ్ సింగ్ మీనా

జయపురం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీసీ టీవీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా దక్షిణ, పశ్చిమ డీఐజీ చరణ్ సింగ్ మీనా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో ఇక ముందు నేరస్తులను సీసీ కెమెరాలు పట్టిస్తాయని హెచ్చరించారు. జయపురంలో 120 అత్యాధునిక కెమెరాలు అమర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు అధికారి రస్మీ రంజన్ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఉత్తర్వులు తొలగించాలి



సమావేశమైన పోలీసులు

భువనేశ్వర్: భరత్‌పూర్ ఠాణా కేసులో పోలీసు సిబ్బందికి వ్యతిరేకంగా చర్యలను ఒడిశా పోలీసు సంఘం వ్యతిరేకించింది. ఈ సంఘటనపై విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విచారణకు ముందుగానే సిబ్బందిని సస్పెండ్ చేయడం తగదని ఆరోపించారు. నివేదిక వెల్లడి అయ్యేంత వరకు సస్పెన్షన్ ఉత్తర్వులు తొలగించాలని పోలీసుల సంఘం అభ్యర్థించింది. మరోవైపు శనివారం స్థానిక పోలీసు గ్రౌండులో 200 మంది పైబడి పోలీసులు సమావేశం అయ్యారు. సిబ్బందికి వ్యతిరేకంగా సస్పెన్షన్ ఉత్తర్వులు తొలగించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. క్రైం శాఖ దర్యాప్తు ముగించి నివేదిక దాఖలు చేసినట్లు సమాచారం. జాతీయ మహిళా కమిషను ఆదేశాల మేరకు ఈ వివరాల్ని అందజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

వివాహిత మృతి

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన సుబుద్ధి బాలామణి(30) పురుగుల మందు తాగడంతో చికిత్స పొందుతూ శ్రీకాకుళం రిమ్స్‌లో శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎం.ఎ.అహ్మద్ తెలిపారు. బాలామణి తన పెద్దమ్మకొడుకుకు రూ.రెండు లక్షలన్నర అప్పు ఇచ్చింది. ఆ సొమ్మును తిరిగి ఇవ్వకుండా పరారవడంతో బాలామణి మనస్తాపం చెంది ఈ నెల 18న ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తూరు సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌లో చేర్పించగా వైద్యం పొందుతూ శనివారం మృతి చెందింది. ఒడిశా రాష్ట్రం రామన్నగూడకు చెందిన మృతురాలి తల్లి మల్లా అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. బాలామణికి భర్త తేజేశ్వరరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రక్తదాతలు ముందుకురావాలి

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఎస్‌ఈ కె.జాన్ సుధాకర్, ఈఈ ఎస్.రవినాయుడులను అభినందించారు. ప్లేట్‌లెట్స్ తగ్గి చాలా మంది రోగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలాంటి సమయంలో యువత పెద్ద ఎత్తున రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 70వేల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, పెంకి చైతన్యకుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

క్లుప్తంగా

కులగణనను వెంటనే చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పూర్ణ చంద్రరావు

విజయనగరం ఫోర్ట్: కులగణనను ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వెంటనే చేపట్టాలని బహుజన్ సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డాక్టర్ పూర్ణచంద్ర రావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 2 వేల మంది వరకు ఎమ్మెల్యేలు అయితే బీసీలు కేవలం 498 మంది మాత్రమే ఎమ్మెల్యేలు అయ్యారని అన్నారు. 1207 మంది కమ్మ, రెడ్డి కులాలకు చెందిన వారు ఎమ్మెల్యేలు అయ్యారని పేర్కొన్నారు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారి ప్రాబల్యం కూడా నేడు అసెంబ్లీలో ఒక సీటుకే పరిమితం అయిందన్నారు. రాష్ట్రంలో 243 కులాలు ఉంటే 200 కులాలకు చెందిన వారికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా అవకాశం లభించలేదన్నారు. కులగణన చేపడతామని టీడీపీ మ్యానిఫెస్టోలో పెట్టిందని, అయినప్పటికీ కులగణన చేపట్టకుండా తాత్సర్యం చేస్తుందన్నారు. అసెంబ్లీలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారని, కులగణన చేస్తే కదా రిజర్వేషన్ కల్పించగలరని తెలిపారు. కులగణన చేయకుండా రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తామని ఇంతవరకు దాని ఊసే లేదన్నారు. రాజ్యసభ, ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టులు అన్ని బీసీలకే ఇవ్వాలన్నారు. బీసీల ఓట్లుతో గద్దె నెక్కిన చంద్రబాబు హామీలు అమలు చేయకపోతే గద్దె దిగాలన్నారు. సమావేశంలో బీఎస్పీ స్టేట్ కో ఆర్డినేటర్ , మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, బి.పరంజ్యోతి పాల్గొన్నారు.

నదిలో పడి వృద్ధురాలి మృతి

మక్కువ: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన శంబంగి గౌరమ్మ(65) నదిలో పడి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గౌరమ్మ ఈ నెల 9న ఇంటి నుండి పొలం పనుల నిమిత్తం గ్రామ సమీపంలోని గోముఖి నది దాటి పంట పొలానికి వెళ్లింది. సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినప్పటికి ఆచూకీ లభించలేదు. అప్పటి నుంచి ఆమెను వెతికే క్రమంలో శనివారం సాయంత్రం దేవర శిర్లాం గ్రామ సమపంలో సువర్ణముఖి నది ఒడ్డున పంప్ హౌస్ వద్ద మృతదేహం కనిపించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

సాలూరు రూరల్: మండలం కరాసువలస గ్రామానికి చెందిన ఇల్లువు దొర కరాసమ్మ (39) శుక్రవారం రాత్రి తన ఇంట్లో అనుమానాస్పదంగా మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు. ఆమె తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఆమె బొడ్డుదొర శ్రీనుని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొంతకాలంగా భర్త తాగి వచ్చి కొడుతుంటాడని ఆ విధంగానే ఆమె మృతిపై అనుమానం ఉన్నట్టు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల కౌన్సెలింగ్

- 64 మందిలో 48 మంది బదిలీలకు అవకాశం

విశాఖ సిటీ: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు ఈ నెల 22వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర (ఉమ్మడి విశాఖ, ఉమ్మడి విజయనగరం, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాల పరిధి) జోన్‌లో మొత్తం 64 సబ్ రిజిస్ట్రార్లు ఉండగా.. తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందులో 48 మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. మార్చి నెలలో పదవీ విరమణ చేయనున్న సబ్ రిజిస్ట్రార్లకు బదిలీల జాబితా నుంచి మినహాయించారు. ఇందులో ఆనందపురం, పాలకొండ సబ్ రిజిస్ట్రార్ వచ్చే ఏడాది మార్చిలోగా పదవీ విరమణ చేయనుండటంతో ఈ స్థానాలను మినహాయించారు. ప్రధానంగా మధురవాడ, భీమిలి, సూపర్ బజార్ ఆర్‌వో, ద్వారకానగర్, అనకాపల్లి, విజయనగరం, విజయనగరం వెస్ట్, శ్రీకాకుళం టౌన్‌తో పాటు కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చేందుకు పలువురు సబ్‌రిజిస్ట్రార్లు పైరవీలు చేసుకుంటున్నారు. తాజా మార్గదర్శకాలతో భోగాపురం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కాస్తా కేటగిరీ–సీలో మారడంతో ఈ స్థానానికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. అయితే అంతా కౌన్సెలింగ్ ద్వారానే జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నా.. అధికార పార్టీ నేతల ద్వారా పైరవీలతో పాటు భారీ ఎత్తున ముడుపులు సమర్పించుకునే వారికి మంచి పోస్టింగులు దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. విశాఖ డీఐజీ బాలకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఈ కౌన్సెలింగ్ టీమ్‌లో విజయనగరం డీఐజీ సభ్యులుగా ఉన్నారు. ప్రధాన కార్యాలయం నుంచి జాయింట్ ఐజీ టి.సరోజ పరిశీలకులుగా వచ్చారు. సబ్ రిజిస్ట్రార్లతో పాటు సీనియర్ అసిస్టెంట్స్, ఆఫీస్ సబార్డినేట్స్ బదిలీలను ఆదివారంతో పూర్తి చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు.

వైద్యులకు ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ తప్పనిసరి

- సదరం పరికరాలు అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: వైద్యులు ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నేషన్ సిస్టం)లో అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. జిల్లా ఆస్పత్రి అభివృద్ధి సమావేశాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలసి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ కోసం ఆస్పత్రికి చాలా దూరం నుండి వచ్చే రోగులకు వీలైతే భోజనం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి సదరం సర్టిఫికెట్ జారీగాని, సదరం వెబ్ సైట్ స్లాట్స్ బుక్ చేసుకొనే చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన రోగులను పరీక్షించేందుకు అవసరం అయినటువంటి పరికరాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోగులకు తాగు నీరు కొరత లేకుండా ఆస్పత్రిలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను మెయింటెనెన్స్ చేయాలన్నారు. జనన, మరణ సర్టిఫికెట్ల జారీ విషయంలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఆస్పత్రిలో డయాగ్నొస్టిక్స్ సర్వీసులన్నీ పని చేసే విధంగా చూసుకోవాలన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో అన్ని యూనిట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యులతో వారానికి ఒక్కసారి మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వనరులతోనే మంచి సేవలు అందించాలన్నారు. రోగికి పెద్ద సమస్య అయితే తప్ప, చిన్న చిన్న సమస్యలకు వేరే ఆస్పత్రికి రిఫర్ చేయకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఆస్పత్రి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలన్నారు. డ్రైనేజీ, శానిటైజేషన్‌లో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. మహా ప్రస్థానం వాహనం ఈ వారంలో ఆస్పత్రిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. హాట్ వాటర్ గర్భిణులకు చాలా అవసరం కనుక హాట్ వాటర్ ప్లాంట్స్ పనిచేసే విధంగా ఉండాలన్నారు. డాక్టర్స్ అందరూ అందుబాటులో ఉండాలన్నారు. వైద్యులు ఆస్పత్రి దగ్గరిలో ఉండే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వాగ్దేవి, పురపాలక సంఘం కమిషనర్ కె.శ్రీనివాస్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

కళ్ల విషయంలో నిర్లక్ష్యం తగదు

- పోలీస్ సంక్షేమంలో భాగంగా ఉచిత కంటివైద్య శిబిరం
- 150 మంది పోలీసులు, కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు
- పర్యవేక్షించిన ఎస్పీ వకుల్ జిందల్


కంటి వైద్యపరీక్షల శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: కంటికి వైద్య పరీక్షలు అందించడంలో నిర్లక్ష్యం తగదని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీసు శాఖ, సంధ్య కంటి ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో శనివారం కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైన వైద్యాన్ని సకాలంలో అందించడంలో కళ్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు అంధకారమేనన్నారు. పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో పడి సకాలంలో వైద్యం తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తారన్నారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని విశాఖకు చెందిన సంధ్య కంటి ఆస్పత్రి వైద్యుల సహకారంతో పోలీస్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సుమారు 150 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన వారికి క్యాటరాక్ట్ చికిత్సలు, ఇతర పరీక్షలు వైద్యులు నిర్వహించి, చికిత్స అందజేస్తారన్నారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, సంధ్య కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు, అమృత్ కుమార్, అశోక్‌కుమార్, ఎస్‌బి సీఐ ఎ.లీలారావు, టాస్క్‌ఫోర్స్ సీఐ బి.వెంకటరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, భగవాన్ పలువురు ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్, సివిల్ పోలీసులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు


ప్రైవేటు ల్యాబ్‌లలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: వైద్యారోగ్య శాఖ నిబంధనలను ప్రైవేటు ఆస్పత్రులు కచ్చితంగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి. జగన్ మోహన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన డీపీఎంఓ డా.రఘుకుమార్, వైద్య బృందంతో కలిసి పట్టణంలో శుభం డయాబెటిక్ – స్పెషాలిటీ కేర్, శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ డెంటల్ కేర్ ఆస్పత్రులను శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, రెన్యువల్ తేదీలు, అర్హత ధ్రువ పత్రాలు సంబంధిత రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో ఉండాల్సిన వైద్య పరికరాలు, పరీక్ష కిట్లు నాణ్యత, పనితీరు పరిశీలించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పక్కగా ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ఉపయోగించిన సూదులు, సెలైన్, కాటన్ తదితర వ్యర్థాలను నిర్దేశించిన మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిర్వహణ, రోగుల టాయిలెట్ల శుభ్రత నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. శుభం స్పెషాలిటీ కేర్‌లో వైద్య పరీక్షల ఫీజు వివరాల లిస్టును ప్రదర్శించకపోవడం, నిర్దేశించిన బోర్డు, ల్యాబ్‌కు సంబంధించిన కొన్ని ధ్రువపత్రాల వివరాలపై ఆరా తీసి నిర్ణీత గడువులో పునరుద్ధరించాలని ఆదేశించారు. రోగుల ఆరోగ్య తనిఖీల, వైద్య పరీక్షల వివరాలు రికార్డులో స్పష్టంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూచనలు, సలహాలు తెలియజేసే వాల్‌పోస్టర్లు ఉండాలన్నారు. వారి వెంట డెమో యోగేశ్వరరెడ్డి, ఈఓ సత్తిబాబు తదితరులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

సాలూరు: పట్టణంలోని డబ్బివీధిలో ఆత్మహత్య చేసుకున్న వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు.. పట్టణంలో డబ్బివీధిలో నివాసముంటున్న పి.సురేష్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయన తన భార్య సంతోషికుమారి(28) మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 18న భార్యాభర్తల మధ్య గొడవ జర్గగా 19వ తేదీ మధ్యాహ్నం ఆమె ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే స్థానికులు ఆమెను సాలూరు ఆస్పత్రికి, అక్కడ నుండి విజయనగరం, విశాఖపట్నం ఆస్పత్రులకు తరలించారు. విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం ఆమె మృతి చెందింది. వీరికి ఏడాదిన్నర వయస్సు గల బాబు ఉన్నాడు. మృతురాలు తల్లి సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఈఎంఆర్‌ఎస్‌ను తనిఖీ చేసిన పీఓ


పాఠశాలలో అందుతున్న సేవలను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదులు, విద్యార్థుల డార్మెటరీలు, తరగతి గదులు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యా ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో శుభ్రతపై ఆరా తీశారు. ఆహార పదార్థాలు కింద వినియోగిస్తున్న కాయగూరల నాణ్యత పట్ల ఆయన ప్రశ్నించారు. విద్యార్థులకు పోషక ఆహారాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులు విద్యా ప్రమాణాలు పక్కాగా ఉండాలని, జాతీయ స్థాయి పోటీల్లో వారు విజయం సాధించే విధంగా విద్యాభ్యాసన కొనసాగాలని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన ఉపాధ్యాయులు స్థానిక భాషను నేర్చుకోవాలని తద్వారా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన చేసి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎక్కడ చెత్త ఉండరాదని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కల్పించాలని మంచి అలవాట్లు నేర్పాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గ్రహించి వారికి తగిన తర్ఫీదు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు అందించిన అర్జీలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించి వాటిని పరిష్కరిస్తామన్నారు. పాఠశాల నిర్వహణలో రాజీ పడరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల్లో గంజాయి వాసన


మెరకముడిదాం మండలంలో ఈ నెల 18న పట్టుబడిన 15 కేజీలు గంజాయితో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ(ఫైల్)

- మునుపెన్నడూ లేని విధంగా గంజాయి సంస్కృతి
- ఆంధ్ర, సుంకి నుంచి దిగుమతి
- గంజాయి కిలో రూ.5 వేలు
- ఇటీవల 15 కేజీల గంజాయితో పట్టుబడిన యువకులు
- రోజురోజుకూ పెరుగుతున్న గంజాయి వినియోగం

చీపురుపల్లి:

ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఇప్పుడు గంజాయి వాసన గుప్పుమంటోంది. ఎక్కడో పెద్ద సిటీల్లో వినియోగించే గంజాయి.. ఇప్పుడు చిన్న చిన్న పల్లెల్లోనూ విక్రయిస్తుండడం, వినియోగించడం కలకలంరేపుతోంది. మునుపెన్నడూ లేని విధంగా చీపురుపల్లి నియోజకవర్గంలోకి గంజాయి సంస్కృతి రావడం, యువత బానిసలుగా మారుతుండడం భయాందోళన కలిగిస్తోంది. కళాశాల విద్యార్థులతో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా గంజాయికి అలవాటు పడుతున్నట్టు సమాచారం. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల్లో ప్రస్తుతం ఎక్కడ విన్నా గంజాయి వినియోగంపైనే చర్చ సాగుతోంది. ఇంతవరకు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వ్యాపారం ఇటీవల మెరకముడిదాం మండలంలో ఏకంగా 15 కేజీలు గంజాయితో యువకులు పట్టుబడడంతో ఏ స్థాయిలో గంజాయి రవాణా, వినియోగం వెలుగులోకి వచ్చింది. దీనిపై అప్రమత్తమైన పోలీసులు కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వినియోగం, రవాణా వల్ల కఠినమైన కేసుల్లో ఇరుక్కుంటారని హెచ్చరిస్తున్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.

ఆంధ్ర, సుంకి నుంచి గంజాయి రవాణా

ఒడిశా రాష్ట్రంలోని సుంకి నుంచి సాలూరు మీదుగా పాచిపెంట, ఆంధ్ర నుంచి మానాపురం, పోర్ల మీదుగా మెరకముడిదాం, గుర్ల మండలాల్లోకి గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం. ఈ కోవలోనే సుంకి నుంచి ఆటోలో తెస్తున్న 15 కిలోల గంజాయిని ఈ నెల 18న మెరకముడిదాం మండలంలో పోలీసులు పట్టుకున్నారు. గంజాయి కూడా పోలీసులు నిర్వహించే సాధారణ వాహన తనిఖీల్లో పట్టుబడడం గమనార్హం.

గంజాయి కిలో రూ.5 వేలకు విక్రయం

ఇదిలా ఉండగా నియోజకవర్గంలోకి తెస్తున్న గంజాయి కిలో రూ.5 వేలుకు విక్రయిస్తున్నట్టు తెలిసింది. సుంకిలో కిలో గంజాయి రూ.2,500కు కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకొచ్చి రూ.5 వేలకు అమ్ముతున్నట్టు సమాచారం. కిలోకు రూ.2,500 లాభం రావడంతో కొందరు గంజాయి వ్యాపారం చేస్తున్నట్టు భోగట్టా.



- అమ్మనాన్నలను కోల్పోయిన చిన్నారులు
- భవిష్యత్ అంధకారమయం
- దాతల సాయం కోరుతున్న సరస్వతీపుత్రులు
- అండగా నిలిచిన కోడూరు అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, గ్రామస్తులు

తల్లిదండ్రులు దూరం.. భవిత భారం

బాడంగి: రెక్కాడితే గాని డొక్కాడని పేదరికం. ఇల్లు తప్ప సెంటు భూమి లేదు. అలాంటి కుటుంబంపై దయలేని విధి పగబట్టింది. తల్లిదండ్రులను దూరం చూసి నలుగురు పిల్లలను వీధిపాలు చేసింది. నిన్నటి వరకు అన్నం పెట్టిన అమ్మ, నీడై పెంచిన నాన్న ఇద్దరూ ఇప్పుడు లేరు. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఆ నలుగురు పిల్లలు దాతల సాయం కోరుతున్నారు. రేపటిపై ఆశ కోసం.. మనసున్న వారి చేయూతను ఆశిస్తున్నారు.

విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన ఇప్పిలి సత్యం, ఈశ్వరమ్మ దంపతులకు నలుగురు పిల్లలు. పెద్ద బ్బాయి ఇప్పిలి చిన్న కూలి పనులు చేస్తున్నాడు. పెద్దమ్మాయి పులి చిన్నారి ఇంటర్, చిన్నమ్మాయి నందిని పదో తరగతి బాడంగిలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్నారు. చిన్న అబ్బాయి అప్పలనాయుడు కోడూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కొన్నాళ్ల కిందట తండ్రి ఇప్పిలి సత్యం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి ఈశ్వరమ్మ పిల్లలను సాకుతోంది. కూలిపనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని రెక్కలుముక్కలు చేసుకుని శ్రమిస్తోంది. ఈ క్రమంలో అనారోగ్యం పాలైన ఆమె ఈనెల 11వ తేదీన మృతి చెందింది. దీంతో ఆ చిన్నారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ చదువులు సాగేదెలాగో తెలియక భయపడుతున్నారు. తమని అదుకునే మానవతా వాదుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

అండగా నిలిచిన 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్'

ఇప్పటికే గ్రామంలో ఎన్నో సహాయ కార్యక్రమాలు చేస్తున్న 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు, గ్రామస్తులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు రూ.60 వేలు, గ్రామస్తులు రూ.70 వేలు అందించి ఆదుకున్నారు.


తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నగదు అందజేస్తున్న 'అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు

సాయం చేయండి

మా చదువులు ఎలా సాగుతాయో, మా జీవితం ఎలా ముందుకు పోతుందోనని ఆందోళనగా ఉంది. దాతలు ఆదుకుంటారని ఆశిస్తున్నాం. సాయం చేయాలనుకునే వారు 87904 51434 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నాం.

– తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు

శరన్నవరాత్రుల్లో దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలు

- కరపత్రాలను ఆవిష్కరించిన పైడితల్లి ఆలయ ఈఓ ప్రసాదరావు


శరన్నవరాత్రుల అలంకరణల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ తదితరులు

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవికి ప్రత్యేక అలంకరణలను చేయనున్నట్టు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ మేరకు కార్యాలయం ఆవరణలో శనివారం ప్రత్యేక అలంకరణల వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబరు 3న గురువారం పాడ్యమి రోజున అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిస్తారన్నారు. 4న గాయత్రీదేవీగా, 5న అన్నపూర్ణాదేవీగా, 6న శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా, 7న మహా చండీదేవీగా, 8న శ్రీ మహాలక్ష్మీదేవిగా, 9న అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం పురస్కరించుకుని శ్రీ సరస్వతీదేవీగా భక్తులకు దర్శనమిస్తారన్నారు. 10న దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారు దుర్గాదేవీగా, 11న మహర్నవమి సందర్భంగా శ్రీ మహిషాసురమర్దినీ దేవీగా, 12న విజయదశమి పురస్కరించుకుని అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీదేవీగా భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. పదిరోజుల పర్వదినాల్లో అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చనలు నిర్వహిస్తున్నామన్నారు. కుంకుమార్చనలలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, కుంకుమ అందజేస్తామన్నారు. భక్తులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, దూసి శివ ప్రసాద్, సూపర్‌వైజర్ ఏడుకొండలు, అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, మణికంఠ పాల్గొన్నారు.

స్టిక్కర్లు అంటించే విధులు నుంచి తప్పించండి


డీఎంహెచ్‌ఓకు విన్నవిస్తున్న సచివాలయం ఏఎన్‌ఎంలు

విజయనగరం ఫోర్ట్: మా మంచి ప్రభుత్వం పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి సంబంధించి ఇంటింటికి స్టిక్కర్లు అందించే విధులు నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని సచివాలయం ఏఎన్‌ఎంలు శనివారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. మా విధులతో మాకు తీరిక లేకుండా ఉందని, దానికి అదనంగా స్టిక్కర్లు అందించే కార్యక్రమంలో పాల్గొనడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. వెటర్నరీ సిబ్బందికి ఈ కార్యక్రమం నుంచి మినహాయింపు ఇచ్చారని, అదే విధంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిత్యం పాల్గొనే మాకు కూడా మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యలో చదువులెలా!

- కలెక్టర్ వద్ద తల్లిదండ్రుల ఆవేదన


కలెక్టర్‌ను చుట్టుముట్టి గోడువినిపిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్: ''సమయానికి భోజనం పెట్టరు.. పడుకోవడం, తినడం అక్కడే.. పాఠాలు వినేదీ అక్కడే! టీచర్లు చెప్పేది మా పిల్లలకు అర్థం కాదు.. పిల్లలు చెప్పేది వారికి బోధపడదు.. మార్కులు చూస్తే ఒకటి, రెండే. మరుగుదొడ్లకు వెళ్తే నీళ్లు ఉండవు.. ఇన్ని అవస్థలు నడుమ పిల్లలు ఎలా చదవగలరు.. మేమెలా చదివించగలం..'' అంటూ ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. 'సార్.. మీరు బాధ్యతలు స్వీకరించగానే పాఠశాలకు వచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మీరు తలుచుకుంటే ఎంతసేపు?' అంటూ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పలు ఏకలవ్య పాఠశాలల్లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు శనివారం చేరుకున్నారు. కలెక్టర్‌ను చుట్టుముట్టి.. సమస్యలను ఏకరవు పెట్టారు. ప్రధానంగా కురుపాం ఏకలవ్య పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల తీరుతో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారంతా వివరించారు. చదువులు సక్రమంగా సాగడం లేదని.. భోజన సదుపాయాలు కూడా సరిగ్గా లేవని వాపోయారు. మెనూ అమలు చేయడం లేదని.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనం పెడుతున్నారని.. విద్యార్థుల కంటే టీచర్లే త్వరగా భోజనం చేస్తున్నారని తెలిపారు. తరగతులు, స్టడీ అవర్లు సక్రమంగా నిర్వహించడం లేదని చెప్పారు. దీంతోపాటు సొంత భవనం లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. చాలీచాలని గదులతో అవస్థలు పడుతున్నారని వివరించారు. ఉపాధ్యాయుల్లో హిందీ వారే ఉండటంతో.. బోధించేది పిల్లలకు అర్థం కావడం లేదని తెలిపారు. దీనివల్ల చాలామందికి సున్నా మార్కులు వస్తున్నాయని వాపోయారు.

గిరిజన విద్యార్థులకు అవస్థలు కలిగించొద్దు

గిరిజన విద్యార్థులను అవస్థలకు గురి చేయడం భావ్యం కాదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల తీరుతో పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా కురుపాం పాఠశాలలో సౌకర్యాలు లేవని.. కనీసం ఫ్యాన్లు కూడా తిరగడం లేదని వివరించారు.

పరిష్కరిస్తాం.. సమయం పడుతుంది : కలెక్టర్

దీనిపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందిస్తూ.. పాఠశాలను మరోచోటకు మారుస్తామని, కాస్త సమయం పడుతుందని చెప్పారు. హిందీ ఉపాధ్యాయులకు తెలుగు వచ్చేందుకు కూడా కొంత సమయం పడుతుందన్నారు. అంతవరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సాయంత్రం వేళ తెలుగు ఉపాధ్యాయుడిని నియమిస్తామని చెప్పారు. వెంటనే ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.